పరాజితులు

శ్రీ వల్లపురెడ్డి

తండ్రి బ్రతికుండగా భానుమూర్తి ఎన్నడూ ఆయనకు పాదాభివందనము సరికదా, చేతులు జోడించి నమస్కారంకూడా చేసి యెరుగడు. దీనికి కారణాలు అట్టే బలమైన వేమీ లేవు. అయినా ఒక్క కారణానికి మాత్రం కొంచెం ప్రాముఖ్యం ఇవ్వొచ్చు.

అతడు ఈనాటికి ముప్పై వసంతాలు కూడా సరిగా చూళ్లేదు. కాని ప్రాపంచిక జ్ఞానంలోనూ, అనుభవాల్లోనూ తన ఈడువారిని మించాడు. ఎదుట నమస్కారం చేసి దాపుకు వెళ్ళటంతోనే దుమ్మెత్తి పోసేవారిని చూశాడు. కొందరు స్వీయ కార్యనిర్వహణార్థం ఎనలేని భక్తిప్రపత్తులు ప్రదర్శించి ఒక్కొక్కప్పుడు అవసరమైనవారి పాదధూళి మస్తకంమీద తాలుస్తారు; ఆ కార్యం కాస్తా ముగిసిపోగానే అతని ఉపకారాన్ని మరచిపోవడమేంగాక సమయ మొచ్చిందంటే అతనికే తీరని అపచారం చేయడానికి నడుం బిగిస్తారు. ఇల్లాంటి మనస్తత్వం కలవారిని రోజూ చూస్తూనే వుంటాడు. అతనికి పరిచయమున్నవారిలోనే—తనకు కొంచెం సన్నిహితులని ఎవరినైతే ఎంచుకుంటాడో వారిలోనే-కొందరికి ఈ ప్రవర్తన బాగా అలవడింది. ప్రసంగవశాత్తు ఎప్పుడైనా అలాంటి మనస్తత్వముపట్ల తనకున్న న్యూనభావం ప్రకటిస్తే వారంతా, "నువ్వింకా ఉప్పుకూ, పర్కరకూ భేదం తెలియనివాడివి బాబూ!" అని తనను అదోమాదిరి చులకన దృష్టితో చూసి నవ్వేవారు.

పరిచయస్తులంతా తన్ను లౌక్యం అంటే తెలియని అమాయకుడిగా జమకట్టినప్పటికీ భానుమూర్తి తన దృక్పథం మార్చుకోలేదు. అతడు విద్యార్థి దశలో వున్నప్పుడే ఎన్నో నైతికసమస్యలను గూర్చి తదేకంగా ఆలోచించేవాడు. తనతోబాటు చదువుతున్న రామ్మూర్తి సెలవుల్లో ఇంటికి వచ్చినప్పుడు అమ్మానాన్నలతో వీలైనంత తీయగా మాట్లాడి అవసరమైన డబ్బులు లాగేవాడు. తిరిగి బస్తీకి వెళ్లడంతోనే వారిని పూర్తిగా మరచిపోయి తన క్షేమసమాచారాలకు అనుదినమూ ఎదురుచూసే వారికి కనీసం మూడు కానీల పోస్టుకార్డు కూడా వ్రాసేవాడుకాదు. రామ్మూర్తి తల్లిదండ్రులపట్ల ప్రదర్శించే నక్కవినయమూ, ఎక్కుపెట్టే నమస్కారబాణాలూ కేవలం తన బస్తీమోజులను తీర్చుగలిగే డబ్బులకొరకు తప్పితే మరిదేనికీ కావని మొదటినుండీ గ్రహిస్తూవచ్చాడు. నీతినిగూర్చి పెద్ద పెద్ద రచయితలూ, కవులూ, వ్రాసిన గ్రంథాల్ని చదివాడు. చదువుతూన్నకొద్దీ అతనికి రక్తసంబంధమైన మమకారం పెకలింపరాని మహావృక్షమని బోధపడింది. తలిదండ్రులకూ, వారి సంతానానికీ మధ్య రక్తం అనేది రాగబంధాల్ని సృష్టించే ఒక అపూర్వమైన సంబంధం......భానుమూర్తి తిరగవేసిన పుస్తకాల పుటల్లో తలిదండ్రులకు నమస్కరించాలనీ, వారిని పూజించాలనీ లేకపోలేదు. అయితే అతను వీటిని బాహ్యంగా పాటించలేదు. నమస్కార బాణా

---

* ఉస్మానియా విశ్వవిద్యాలయం ఈ సంవత్సరం జరిపిన కథలపోటీలో యావదాంధ్రంలోని కళాశాలల విద్యార్థులూ పాల్గొన్నారు. రెండు కథలు మొదటి బహుమతికీ, రెండు కథలు రెండో బహుమతికీ, రెండు కథలు మూడవ బహుమతికీ – ఇలా ఆరు కథలు అర్హతను పొందాయి. ప్రథమ బహుమతి పొందిన రెండు కథల్లో శ్రీ అరిపిరాల విశ్వంగారి కథను గతమాసం భారతిలో ప్రకటించాం. ఇది ప్రథమ బహుమతి పొందిన రెండవ కథ.

లతో ఇతరుల్ని బాధించే మహాశయుల్ని చూసినప్పటి నుంచే అతని దృష్టిలో నమస్కారానికున్న సిసలయిన విలువ తగ్గిపోయింది. అంచేత అతను తలిదండ్రులకు నమస్కారాలు గానీ, పాదాభివందనాలు గానీ, అంత కంటే మహత్తరమైన, మరేరకమైన గౌరవప్రక్రియలు గానీ మనస్సులోనే కావించాడు. ఆ తీరే పవిత్రమైం దిగా భావించాడు.

అయితే, కొన్నాళ్ళుగా అతనికి తన తలిదండ్రుల మీద వున్న భక్తి విశ్వాసాలూ, రాగమూ, వినయమూ సడలిపోయినవి. తలిదండ్రులమీద కపటమైన వినయవిధేయతల్ని ప్రదర్శించే రామ్మూర్తిలాంటి వాళ్ళు లోకంలో వున్నట్లే, తమ సంతానంమీద కృత్రిమ వాత్సల్యాన్ని ప్రకటించే తలిదండ్రులు కూడ వుంటారని అతని మనస్సులో స్థిరపడిపోయింది. దీనికి మూలకారణం అతనికి అత్యంతాత్మీయుడైన అన్నగారి మరణమే.

స్కూలుఫైనలు పరీక్షనుంచి ఇంటికి రావటంతోనే భానుమూర్తి, బావిలోపడి, ఆత్మహత్య చేసుకున్న అన్నగారి శవాన్ని చూడటం తటస్థించింది. ఆ దృశ్యమే అతని హృదయంలో అగ్నిప్రళయాన్ని సృష్టించి అతఃపూర్వం అతనికి జననీజనకులమీద వున్న సదభిప్రాయాల్నన్నిటినీ భస్మం చేసి వేసింది.

*　　*　　*

భానుమూర్తి స్కూలుఫైనలు చదువుకొరకు బస్తీకి వెళ్ళిన మూడో నెలాంతంలో వున్నట్లుండి అన్నగారు బస్తీకి వచ్చేశారొకనాడు. రావటంతోనే మామూలుగా అన్నగారి చేతిసంచిని పరిశీలించాడు. దానిలో వున్న పంచె, రెండు చొక్కాలూ, బనీనూ, షేవింగుమెషీనూ చూసేసరికి ఏదో అనుమానం వేసింది. అన్నయ్య ఎప్పుడేనా తనదగ్గిరికి వస్తే కట్టుబట్టలతో వచ్చేవాడు. అలాకాకుండా వేరువిధంగా రావడం అతని హృదయంలో అనిర్వచనీయమయిన ఆవేదనను కలిగించింది. అన్నయ్య ముఖంలోకి ప్రశ్నార్థకంగా చూశాడు. తమ్ముని చూపుకి సమాధానం ఏమీ చెప్పకుండా దాదాపు దుఃఖసంచ్ఛన్నమైన వదనాన్ని క్రిందికి దించుకున్నాడు.

"రా అన్నయ్యా! అటు వెడదాం" అన్నాడు భానుమూర్తి.

అన్నయ్య మారు పలక్కుండా లేచి తమ్ముణ్ని అనుసరించాడు. అలా బస్తీ బయట వున్న చెరువుగట్టు మీద సాయంత్రపు చల్లగాలిలో వెడుతున్నారు. ఇరువురూ ఏమీ మాట్లాడకుండా మౌనంగా వెడుతుంటే అన్నయ్య ఒకచోట అకస్మాత్తుగా ఆగాడు. ముందరికి వెళ్ళినవాడల్లా తమ్ముడు వెనక్కువచ్చి దుఃఖభారంతో కృంగిపోతున్న అన్నయ్యను చూసి "ఏమిటన్నాయ్?" అన్నాడు.

"ఇంటికి వెళ్లు తమ్ముడూ!" అన్నాడు కళ్లల్లో నీళ్లుమలచుకుంటూనే.

"ఎందుకన్నా?"—అడిగాడు భానుమూర్తి.

"నీ సంసారం చూసుకో వెళ్ళు." ఈసారి కళ్లలోని నీళ్లు కొన్తా జారి జొటజొటామని క్రింద పడినయి. ఏడుస్తున్న ధ్వని బయటికి రాలేక గొంతులోనే ఘూర్ణిల్లటం ప్రారంభించింది.

అన్నదమ్ములు చిన్ననాటినుంచీ నిరుపమానమైన అన్యోన్యతతో జీవించారు. ఓ ఒక్కనాడూ నీవూ నేననే భేదం రానివ్వలేదు. శరీరాలు వేరైనా ఆత్మలు ఒకటిగా మెలిగారు వారి నిర్వ్యాజ మైత్రిని చూసి ఊళ్లోవాళ్లంతా అప్పుడే రామలక్ష్మణులనే బిరుదాన్ని ప్రసాదించారు. ఒకో సంసారంలోని అన్నాదమ్ములు, ఒకరి అభిప్రాయంతో ఒకరు ఏకీభవించలేక, విభాగాలవుతుంటే ఒక్కోసారి అన్నయ్య "చూడు తమ్ముడూ! పెద్దవాడివయాక నువ్వు నా నుండి అలా విడిపోతావేమో!" అనేవాడు. తమ్ముడు అలా ఎన్నటికీ కాదని గుండెధైర్యంతో పలికితే అన్నయ్యే మళ్లీ, "ఏమో, ఎవరికి తెలుసు, నీ భార్యవస్తే, ఆమె మాటల్లో పడి నువ్వు సామాన్యులకు మల్లే నా నుండి వేరైపోయి గర్భశత్రువుగా మారిపోతావేమో!" అన్నప్పుడల్లా భానుమూర్తి నుండి ఒకటే సమాధానం వెలువడేది, "మనిద్దరికీ మధ్య విభేదం కల్పించే ప్రమాదం భార్యాగమనంవల్ల జరిగేటట్లయితే నాకా పెళ్లే అక్కర్లేదు. ప్రమాణం చెయ్యనా?" అని. పుట్టినప్పటి నుంచీ తమ్ముడి మనో నైర్మల్యాన్ని పరిశీలిస్తూ వచ్చిన అన్నయ్య తమ్ముడి మాటల్లో అడ్డుపడి "ఆగు తమ్ముడూ అంత పనీ చేశేవ్? ఊరికే అలా అన్నానంతే కాని, నీ మనసు నాకు తెలీదూ? మన మనసులు ఒకటిగా వుండాలికాని ఆడవాళ్ళేం చేయగలుగుతారు?—ఈ విధంగా నడిచింది వారి నిర్వ్యాజ ప్రేమానుబంధం.

అన్నయ్య, 'వెళ్ళి నీ సంసారం చూసుకో,' అని అనే సరికి తమ్ముడు త్రుళ్ళిపడ్డాడు. తన నెవరో చెంపమీద ఛెళ్ళుమని కొట్టినట్లుగా బాధపడ్డాడు. మన స్సులోని వేదన నాపుకోలేక? "ఏమిటన్నయ్యా, ఇలా మాట్లాడుతున్నావు?" అనడిగాడు.

"అవును తమ్ముడూ ..." — అన్నయ్య ఇక మాట్లాడలేక పోయాడు. గొంతులో సుళ్ళు తిరుగుతూ వున్న దుఃఖపు తెరలు కాస్తా ధ్వనిచేస్తూ బయటికి వచ్చేసినయి. భానుమూర్తి భరించలేక పోయాడు. "ఏడ్పెందు కొచ్చిందన్నయ్యా? ఏం జరిగిందో కొంచెం చెప్పు. నీవలా ఏమీ చెప్పకుండా ఏడిస్తే నేనిక అట్టే సేపుండలేను. నాగుండె పగిలిపోతుంది".

అన్నయ్య కళ్లనీళ్ళు తుడుచుకొని పొర్లి వస్తున్న ఏడ్పును బిగబట్టుకొని బహు కష్టంగా అన్నాడు: "ఏం చెప్పను భానూ! వుండుండీ మన సంసార వృక్షానికి కోతి మూతిపిందెలు పుట్టినయి. అమ్మా నాన్నలు ఎవరి చెప్పుడుమాటలకు లొంగి పోయారో తెలీదు కాని, కొన్నాళ్లనుండీ, మీ వదిన్నూ, నన్నూ ఒక తేపనిగా తిడుతున్నారు. అతిట్లు సర్వసామాన్యమైనవి కాకపోవడంవల్ల నా హృదయాన్ని శూలాల్లా బాధ పరుస్తున్నాయి. ఇన్నాళ్లుగా చూస్తున్నావుకదా, మీ వదిన దొంగతనం చేస్తుందంటే నమ్ముతావూ? ఇంట్లో బియ్యం అమ్ముకుందట. అందుకని మీ వదినను నాన్న అనరానిమాటలు అన్నాడు. అఖరుకొస్తే 'దుడుకముండా!' అనటానిక్కూడా సంకోచించలేదు. నా అసమర్థతవల్లే ఇంతదూరం జరిగిందట. నన్నూ నానా మాటలూ అని, ఇష్టమయితే భాగం పంచుకొని వేరుగా ఉండమనీ, లేకపోతే ఇంటిపెత్తనం చలాయించమనీ తాళాలగుత్తిని నామీదకు కోపంకొద్దీ విసిరారు."—

భానుమూర్తి ఏమీ మాట్లాడలేకపోయాడు. తన దృష్టిలో ఆనాటివరకు తలిదండ్రులూ, అన్నా వదినలూ, దైవసమానులు. వారి పవిత్రవాత్సల్యాన్ని సంపాదించడమే తనకు పరమధర్మం. ఎప్పుడైనా వాళ్ళను గురించి అపోహలు కాకతాళీయంగా తనలో తలెత్తితే వెంటనే అది తన అజ్ఞానం తప్ప వేరేమీ కాదని తెల్సుకొని ఇకముందు వారినలా అపార్థం చేసుకోకుండా ఉండటానికి నిర్ణయించుకునేవాడు.— అన్నయ్య చెబుతూన్న మాటలు ఎంతవరకు నిజమో ఒక నిశ్చయానికి రాలేకపోయాడు.

కొంచెం ఆగి తరువాత అన్నయ్యే మళ్ళీ మొదలెట్టాడు, "తమ్ముడూ నువ్వే చెప్పు. నాన్న అనాలోచితంగా ఆ రెండుషరతులూ పెట్టాడు. కాని ఆ రెంటిలో ఏ ఒక్కదానైనా నేను అంగీకరించగల్గుతానా? భాగం పంచుకున్నా, ఇంటిపెత్తనం చేతిలోకి తీసుకున్నా లోకం నావైపే వేలెట్టిచూపుతుంది. తండ్రితో వేరుపడిపోయినవాడూ, తండ్రి వుండగానే పెత్తనం చేతిలోకి తీసుకొన్నవాడూ, ఒక కొడుకవుతాడా?"—తమ్ముని ముఖంలోకి చూశాడు.

"అయితే మరేంనిర్ణయించుకున్నావన్నయ్యా?" హృదయవిదారకమైన మాటల్ని వినలేక అడిగాడు.

"ఏం నిర్ణయించుకోమంటావు భానూ, ఆరెండు మినహాయించి మూడోది-ఎక్కడికేనా వెళ్ళిపోవడం."

"అలాంటప్పుడు నాకుమాత్రం ఇంటితో పనేముంది? నేనూ వస్తాను నీవెంట"—"మన మిద్దరం విడిపోకుండా ఉండాలని చిన్ననాటినుంచీ అనుకున్న మాటలనే జ్ఞప్తికి తెచ్చుకో" అన్నట్లు చూస్తూ నిలబడ్డాడు భానుమూర్తి.

"అలాజరుగరాదు తమ్ముడూ! వాళ్ళకు నీపైని కొండంత ఆశవుంది. నువ్వుకూడా నన్ననుసరిస్తే వాళ్లు దుఃఖంలో మునిగిపోతారు. నువు వెళ్లు, నన్ను మరచిపో."—అన్నయ్య మాటలలోని వింతతీరు భానుమూర్తిని కలవరపరచింది.

"నీకు తెలుసు కదన్నయ్యా. నేను నిన్ను వదలి వుండలేను; అలాగే అమ్మా నాన్నలనూ. అందుకేనా సలహా ఒకటి విను."—'ఏమిటి?' అన్నట్లు ప్రశ్నార్థకంగా చూశాడు అన్న. "సంసారాల్లో ఇలాంటికలహాలు సామన్యంగా జరుగుతూనే ఉంటాయి. వీటన్నిటినీ సర్దుకుపోవాలికాని, ప్రతిదానినీ మనసుకు పట్టించుకుని బాధపడడం మనలాంటి వాళ్లకు తగని పని. నేను రేపు ఊరికి వెళ్లి పరిస్థితులు చూసి వస్తాను. అమ్మా నాన్నలు ఏదో ఆవేశంలో నిన్నలా అన్నారే కాని తప్పకుండా బాధపడుతుంటారీపాటికి. నేను వచ్చేదాకా నువ్విక్కడే ఉండు." భానుమూర్తి, 'సరేనా?' అన్నట్లు చూశాడు అన్న ముఖంలోకి.

చీకట్లు ముసురుకున్న ముఖాన్ని క్రిందికి వంచాడు అన్నయ్య. అమోదం అంగీకార సూచకమే ఐంది. అప్పటికే సాయంత్రం కావచ్చింది. బస్తీలో

ఎలక్ట్రిక్ దీపాలు వెలిగినై. అన్నాదమ్ములు గృహోన్ముఖులై నడిచారు.

అన్నయ్య భోజనం సరిగా చెయ్యలేదు. మెతుకులు కొరుకుతూంటే భానుమూర్తి కూడా అన్నం సగంలోనే విడిచి, లేచి చేయి కడుక్కున్నాడు. అన్న ఏదో వేదనలో ఉన్నాడని భానుకు తెలుసు. తొమ్మిదవగానే బలవంతాన సినిమాకి లాక్కెళ్లాడు—తన్మాత్రంగానైనా కాస్సేపు వికలమైన మనస్సు శాంతిస్తుందేమో నని అతని ఊహ.

అన్నయ్యను బస్తీలోనే ఉంచి భానుమూర్తి తన గ్రామానికి వెళ్ళాడు. బస్సు దిగి ఇంటికి వెడుతుంటే దారిలోనే తనకు వంశసంబంధి అయిన ఒకామె ఎదురైంది. "భానూ, బస్తీకి మీ అన్నయ్య గాని వచ్చాడా ?" అని పలకరించింది.

"రాలేదు ; ఏం, ఇక్కడలేడా ?"—తనకేమీ తెలియనట్లుగా నటించాడు ; ఆమె ఏమైనా చెబుతుందేమోనని.

"నిన్నటినుంచీ కన్పడ్డంలేదు."

"ఏం జరిగిందేమిటి ?"

"ఏం జరగాలి ? మీ అమ్మా నాన్నా, నిన్న, మీ వదిన్నా మీ అన్నయ్యనూ అనరాని మాటలన్నీ అన్నారు. కాటికి కాళ్లుచాచుకున్న ఈ వయస్సులో వారికదేం తోచిందో కానీ చేతికి వచ్చిన కొడుకుని జారవిడుచుకున్నారు. అబ్బ, అవి అనాల్సిన మాటలేనా ? అన్నయ్య మనస్సు విరిగి ఎక్కడికి వెళ్ళాడో ఏమో. ఇంతకూ నీ దగ్గరికి వచ్చి ఉంటాడేమోనని అనుకున్నాం."

"ఉహుఁ, రాలేదు."

"మీ వదినఊరికి గాని వెళ్ళాడేమో !"

"ఏమో, కావచ్చు-" భానుమూర్తి చాలాసేపు మాట్లాడ్డంవల్ల ప్రయోజనం లేదని ఎంచి ముందుకు నడిచిపోయాడు. ఇంట్లో జరిగిన కలహాన్నిగురించి చెప్పిందికాని కారణం చెప్పలేదు. ఏమై ఉంటుందని ఆలోచించుకుంటూ ఇంట్లో అడుగు పెట్టాడు.

"ఇదే రావడమా భానూ ? పరామర్శించాడు నాన్నగారు. ఆయన ముఖం ఎప్పటికి మల్లే చిరునవ్వుతో కళకళగా లేదు. ఆ ముఖంలో గాంభీర్యం, కించిత్ కోపం ద్యోతకమవుతున్నయి. కంఠస్వరం కొంచెం హీనంగావున్నా మార్దవం మాత్రం లోపించలేదు. సామాన్యంగానే, ఉంది.

"అవును నాన్నా" జవాబిచ్చాడు భాను.

"ఇప్పుడేం సెలవులా ?"

"కాదు. కొంచం డబ్బు అవసరం ఉం? వచ్చాను."

"నువ్వు వారంక్రితం డబ్బుకోసం వ్రాసిన ఉత్తరం చేరింది. నిన్ననే పోస్టుద్వారా పంపాను. ఇంకా చేరలేదా ?"

"లేదు. బహుశః ఇవాళ అందవచ్చు."

ఇంట్లోకి వెళ్ళి ఫలహారం చెయ్యటానికి కూర్చున్నాడు. అమ్మ ఏమీ మాట్లాడలేదు. ఆమె ముఖంలో కూడా ఇప్పుడో అప్పుడో వర్షించనున్న కారుమేఘాలు వ్యక్తమయ్యాయి.

బస్తీలో అన్న చెప్పినదంతా విన్నాక భానుమూర్తికి తలిదండ్రులమీద ఒళ్ళెరుగని ఆవేశమూ, క్రోధమూ జనించాయి. అతని దృష్టిలో తలిదండ్రులు తననూ, అన్నయ్యనూ వేరుచేసే కటిక వాని కత్తిలా అగుపడ్డారు. ఇంటికి రావడంతోనే ఇరువురినీ ఏదో అడిగి అటో ఇటో తేల్చుకోవాలనుకున్నాడు. కాని ప్రథమదర్శనం తండ్రిగారిది కావడంతోనే అతనిలో విజృంభించిన క్రోధావేశాలు పిక్కబలం చూపినయ్. పుట్టినప్పట్నుంచీ తండ్రిగారు ఎన్నడూ కట్టుచ్చుకు తమకు వినయ విధేయతలూ, భయభక్తులూ నేర్పలేదు; అయినా, ఆయన ముఖంలోని గాంభీర్యమూ, కళ్లలోని తేజస్సూ సంతానానికి తలిదండ్రులపట్ల కన్పరచాల్సిన నడవడిని తర్ఫీదు నివ్వడానికి సరిపోయినై. తండ్రిలో ఉన్న ఈ మహత్తర శక్తులే భానుమూర్తిని నోరు మెదపనివ్వలేదు.

అన్నయ్య ప్రక్కనలేకుండా భానుమూర్తి చాలా అరుదుగా భోంచేసేవాడు. అతనికి ఫలహారం సహించలేదు. అయినా మధ్యలో వదిలివేస్తే విషయాలు అన్నీ తనకవగతమైనట్లుగా భావిస్తారనీ, ఆ శంకవారిలో కలగకుండా చేయాలనే ఉద్దేశంతో పూర్తిచేసి బయటకివచ్చాడు.

"దొరగారు రాలేదా బస్తీకి ?"—ప్రాంగణంలో కూర్చుని చుట్ట పీలుస్తున్న నాన్నగారు ప్రశ్నించారు.

ప్రశ్నవిని భానుమూర్తి ఉలిక్కిపడ్డాడు. 'దొరగారు, అనే సంబోధన అన్నయ్యను గూర్చేనని తెలుసుకున్నాడు. అందరికీ అన్నయ్య తనదగ్గరికే వచ్చి ఉండొచ్చుననే అనుమానం ఎందుకు కలిగిందా అని కొంచెం ఆలోచించాడు.

జవాబివ్వడంలో వెనక ముందాడితే వారి అనుమానం దృఢపడిపోతుందని, వెంటనే "లేదు" అన్నాడు.

"రాణీగారి గ్రామానికి వెళ్లాడేమో!" అని తనకు తానే చెప్పుకొని మౌనం వహించాడు. 'రాణీగార'నే, సంబోధన వదినకు చెందింది. ఈ పదాలు సామాన్యంగా కోపం వస్తేగాని ఒకరి విషయంలో నాన్నగారి నోటినుండి ఉచ్చరింపబడవు. ఆయన ఇక తనను ఎక్కువేమీ ప్రశ్నించలేదు. కాని "ఇదెంత,? దీని తాహతెంత? నన్ను, వాడు, అన్నదాక వో రత్తదే! దాని తాలూకువాళ్లు కలవారైతేకానీ; ధనం తక్కువైనంత మాత్రాన అభిమానధనం తక్కువైందనుకున్నదేమో! వెధవది-ఛీ-దానికంటే తెలివిలేక పోయింది అనుకుందాం. కాని దాని కొంగు పట్టుకుని తిరిగే వెధవకి ఉండకూడదూ? దాని మాటల్లోపడి కన్న తలిదండ్రులను తూలనాడి వెళ్ళిపోతాడా? పోనీ, వాడు మాకు పుట్టనేలేదనుకుంటాం..." అని ఏమేమో పెద్ద గొంతుకతో మాట్లాడాడు. భానుమూర్తి ఊరికే వింటూ కూర్చున్నాడు.

మధ్యాహ్నం నాన్నలేని సమయం చూసి అమ్మ మొదలెట్టింది. "మీ అన్నయ్య అక్కడికి రాలేదా నాయనా?" అని.

అందరికీ ఇచ్చిన జవాబునే అమ్మకూ ఇచ్చాడు.

"నీ దగ్గరకి వచ్చి ఉంటాడనుకున్నాం. ఇక మీ వదిన దగ్గరికి కాకపోతే ఎక్కడికి వెడతాడు? ఆ నాడు మీ వదిన మాట్లాడిన మాటలు తలచుకుంటే......" విషయమేమిటో చెప్పకుండానే అమ్మ ఏడ్పు సాగించింది. కళ్లకు కొంగు చాటు పెట్టుకుంది.

నాన్నను చూస్తే పిల్లిగా మారే భానుమూర్తి అమ్మతో కొంచెం ధైర్యంగా మాట్లాడగలడు. "అసలు ఏం జరిగిందో చెప్పకుండానే ఏడిస్తే ఎట్లానే అమ్మా?" అన్నాడు చీకాకు పడుతూ.

"ఏం చెప్పను నాయనా. అది, ఎంతైనా మామ గదా అని, మీ నాన్నను కాస్త గౌరవంగా కూడా మాట్లాడలేదు. ఒకచీర తీసుకు రావడానకు తాహతు లేదు, ఒకరవికె కొనివ్వడానకు తాహతులేదు. వీళ్లు కోడళ్లతో కాపురం చేయించుకుంటారట, కాపురం! కోడలితో సమరసంగా మాట్లాడలేనివాడు, వీడూ ఒక మామట! ఇదీ ఒక అత్తట, ఇట్లా అంది. నన్నంటే ఫరవాలేదు. కాని నలుగురిలో పరువూ ప్రతిష్ఠా కలిగి బ్రతికిన మీ నాన్నను అలా అంటే సహిస్తాడా? చూసేవాళ్లకు నవ్వులాట కాదూ? మీ నాన్న కోడలితో సమరసంగా మాట్లాడాల్సిన అవసరం ఎంత వరకుంటుంది నాయనా? ఎప్పుడూ పల్లెత్తుమాట అని ఎరుగడే! ఇంతకూ అది లేనిపోని అపనిందలన్నీ మోపి పచ్చని సంసారంలో చిచ్చు పెట్టాలని చూసింది. లేకపోతే దానికి చీరెలూ, రవికెలూ మీ నాన్న కొనివ్వకపోతే మరెవ్వరు తగలెట్టారు? ఏమో వినేవాళ్లకి దాని కపటం ఏం తెలుసు? చూడటానికేమో అది పిల్లయిపోతుంది. లోకులు ఔనమ్మా, కుఱ్ఱదాన్ని చేసి తిప్పలు పెడుతున్నారు అని అనుకుంటారు. కాని దీని నిష్కారణ నిందలోని నిజం గ్రహిస్తారా? పోనీ దానికంటే తెలివి లేకపోయింది అనుకుంటే మీ అన్నయ్య కూడా అది చెప్పినట్లల్లా ఆడుతూ దాని కొంగట్టుకుని వెళ్లిపోతాడా? పది నెల్లూ మోసి కనిపెంచిన దిందుకేనా? తలిదండ్రుల్ని రద్దీపెట్టడానికేనా? ఇన్ని పాట్లుపడి ఈ సంసారం వెలగబెట్టేది మీకోసకు కాకుంటే మరెవ్వరికోరకు? వాడలా వెళ్ళిపోతే మాకుమాత్రం ఆ వేదన ఉండదూ?" అమ్మ సుదీర్ఘమైన ఉపన్యాసం సాగించింది.

భానుమూర్తి వింటూ నోరు మెదపలేక పోయాడు. అన్న చెప్పిన విషయాలకూ, ఇక్కడ తను విన్న విషయాలకూ మూడుకూ తొమ్మిదికి (3-౯) వున్నంత సామ్యంవుంది. తలిదండ్రులమీద కొండంత భక్తీ భయమూ; అన్నపట్ల అంతే అభిమానమూ గౌరవమూ, ఎవరి మాటలనూ తప్పని అనలేక పోయాడు. ఇక మిగిలినది వదిన. ఆమె సంసారానికివచ్చి ఐదో ఏడు. అన్నగారి వివాహానికి తత్పూర్వంనుంచే తను ఊరికి దూరంగావున్న బస్తీలో విద్యాభ్యాసం చేస్తున్నాడు. అంచేత వదిన మనస్తత్వం ఎలాంటిదో అతనికి తెలియదు. తెలుసుకోవాలని ప్రయత్నించనూలేదు. అయినా 'వదిన' అనే మాటకు రామాయణంలో లక్ష్మ

ణుడు సీతకు ఎంత గౌరవంఇచ్చాడో అంతగౌరవం ఇచ్చాడు. అందుచేత వదినమీద కూడా ఏవిధమైన నేరాన్ని మోపలేకపోయాడు. ఏ ఒక్క నిర్ణయానికీ రాలేక చివరకు యిలా అన్నాడు: "అమ్మా! జరిగిందేదో జరిగిపోయింది. అన్నయ్య ఈ మారు గాని ఇంటికి వస్తే ఆయన్ను ఏమీ అనకండి. నాన్నతో కూడా ఈ మాట చెప్పు."—

"ఏవరంమాత్రం ఎందుకంటాం నాయనా? వాడేం పరాయివాడా? మా హృదయంలోని భాగం కాడా?" అంది తల్లి గద్గదస్వరంతో.

"ఆఁ, నేనూ అదే అంటున్నాను. ఆయన్ను మీరు పల్లెత్తుమాటైనా అన్నారంటే ఇక నన్ను కూడా చూడ్లేరు. నేనూ వెళ్ళిపోతాను." అన్నాడు. ఈ మాటల్లో అదోవిధమైన అధికారంతో కూడిన ధ్వని వ్యక్తమైంది. అందుక్కారణం ఇన్నాళ్ళూ అమ్మానాన్నలకు అన్నపైనికంటే తనమీద వాత్సల్యం మెండు అని భ్రమించడమే. భానుమూర్తి పలికిన ఈ మాటల్లో మరోధ్వనికూడా వుంది. 'ఇంతవరకు మీరే ఏవో మాటలని ఆయన్ను వెళ్ళిపోయేట్లు చేశారు.' అనేది ఆధ్వని. అన్నపైని పాతుకుపోయిన అధికతరమైన విశ్వాసం అమ్మానాన్నలను ఈ మాత్రం నేరస్థులుగా చేసేందుకు ఒడబరచిందతణ్ణి.

కాని, తల్లి ఇచ్చిన సమాధానం వినగానే అతనికి విద్యుద్ఘాతం తగిలినట్లయింది. "వెళ్ళిపో, ఇప్పుడు పోయినవాణ్ణి ఏంచేయగలిగాం; నీవుపోతే ఏంచేస్తాం? మారాత ఇంతే వుందనుకుని అఘోరించుకుంటాం."— ఇది తల్లి సమాధానం. నిశ్చలమైన కంఠంతో అంది. దీనివల్ల వాళ్లమనస్సు ఎంత గాయపడ్డదో అతనికి స్ఫురించింది.

భానుమూర్తి సాయంత్రం బస్సుకే వెళ్లిపోవడానికి సిద్ధపడ్డాడు. ఎవరూ మరోరోజు వుండమన లేదు. తండ్రి అందాకా వెంటవచ్చాడు. బస్సులో ఎక్కాక ఒకేఒక మాటచెప్పాడు.

"భానూ! ఎవరేం చెప్పినా నువ్వీ విషయాలని ఏమీ మనస్సుకు పట్టించుకోకు, జాగ్రత్తగా చదువుకో"—ఈ మాట చెప్పి ఆయన భారంగా అడుగులు వేసుకుంటూ వెళ్లిపోయాడు ఇంటి మొగమై. తండ్రి మాటల్లో, "ఇలాంటి కలహాలు ఎల్లకాలం వుండేవి కావు, ఎన్నడేనా ఒకనాడు పరిష్కరింపబడుతాయి అనే అభిప్రాయం ఇమిడివుంది. అది తత్కాలానికి భానుమూర్తికి అవగాహనం కాలేదు.

బస్తీకి వెళ్లేసరికి అన్నగారక్కడ లేరు. ఇంటివాళ్లకు గది తాళం చెవి యిచ్చి వూరికి వెళ్తానని చెప్పి వెళ్ళాడట. భానుమూర్తి మొదట భయపడ్డాడు. కాని వదినగారి ఊరికి వెళ్లి ఉంటాడని ఊహించి అక్కడికి వెళ్ళాడు. అనుకున్నట్లుగానే అక్కడ అన్నగారు ఉన్నారు. ఇంటిదగ్గర అమ్మానాన్నలు ఎవరినీ ఏమీ అనే స్థితిలో లేరని చెప్పాడు.

"మళ్లీ ఇంటికి వెళ్లడానికి ఏమీ మనస్పొప్పడం లేదు భానూ!" అన్నాడు అన్న.

"అదేం పరాయివాళ్ల ఇల్లా? నీ యింటికి నువ్వు వెళ్లడంలో నామోషీ ఏమిటి? వెళ్లి న్నా. వెళ్లలేక పోతే నన్నూ నీవెంట తీసుకొనివెళ్లు."

తమ్ముడికి తనపట్ల ఉన్న ఆదరాభిమానాలకీ, భక్తివిశ్వాసాలకీ చలించి పోయాడు అన్న. వాడి వేడుకోలుకు ఒక్కమాట కూడా వ్యతిరేకంగా చెప్పలేదు. "సరే, తమ్ముడూ! వెడతాను. నిన్ను తలచుకుంటూ ఆ ఇంట్లో ఉంటాను. నువ్వెళ్లి బాగా చదువుకో." అన్నాడు.

* * *

చలికాలపు సెలవుల్లో ఇంటికి వెళ్ళాడు భానుమూర్తి. అన్నయ్య ఇంటి దగ్గర లేడు. 'పెళ్లాం ఊరికి వెళ్లి ఉంటాడు' అని చెప్పారు అమ్మానాన్నలు. ఈ మధ్య పొలంపనులు చూట్టం బొత్తిగా మాని వేశాడనీ, వేళకువచ్చి ఇంట్లో భోంచేసి పోతుంటాడనీ వారానికోసారి ఊరు వదిలి పోతుంటాడనీ తెలిసింది. నాన్న మాత్రం అన్నయ్యనూ, వదిననూ గురించిచాలా చెడ్డగా మాట్లాడాడు. "ఆ దుకుకముండ మాటల్లోపడి వాడు పూర్తిగా మారిపోయాడు. మీ అమ్మని "ఏమే, అన్నదాక నోరు విప్పడే! ఛీ-వాడూ ఒక మనిషేనా? ఇప్పుడు పంటలన్నీ నూర్పులు చేసే సమయం. ఇలాంటప్పుడు ఇంటిపట్టున ఉండక అటూ ఇటూ ఇష్టం వచ్చిన రీతిగా తిరిగితే ఏట్లాగు? ఈ వయస్సులో చేలుతిరిగి కాపలకాసే తాహతు నాకులేదు, జీతగాళ్ళను నమ్ముకుంటే ఇంతవరకే కావలసినంత నష్టం వచ్చింది. పోనీ, ఎంతనష్టపడినా పరవాలేదు. భానూ! నువ్వు మాత్రం వాడి సాంగత్యంలో పడకు. వాడి

పంక్తిలో భోజనం కూడా చెయ్యకు." అన్నాడు ఆవేశంలోకివచ్చి.

భానుమూర్తి మౌనంగా అన్నీ విన్నాడు. తండ్రి వదినను 'దుశుకముండ' అని సంబోధించడమే కాక, "దాన్ని మాదిగ లకుగా" అనే వరకు వచ్చాడు. అన్నయ్యతో తనకు పంక్తి భోజనం కూడా నిషేధించిన తండ్రి మీద ఏదో అనిర్వచనీయమైన ఇది, కలిగింది. ఇవన్నీ ఒక తండ్రి మాట్లాడాల్సిన మాటలేనా? అనుకున్నాడు. అన్నా వదినా ఆయన అనేమాటలు వినలేకపోయాడు.

ఇంట్లో ఉంటానికి మనస్సు ఒప్పుకోలేదు. ఒంటినిండా ముళ్ళూ, సూదులూ గుచ్చుకుంటున్నట్లుగా అనుభవించాడు. పరీక్ష చదువు మిషపెట్టి బస్తీకి వెడదామనుకుంటూండగానే అన్నయ్య వచ్చాడు.

తండ్రి ఉక్రోశంతో భానుమూర్తిని పెద్దవాని పంక్తిలో కూర్చోవద్దన్నాడేగాని, వాళ్ళిద్దరూ కలసి భోంచేస్తుంటే చూసి కూడా ఏమీ అనలేదు. అన్నా తమ్ముడూ ఖులాసాగా ఆ మాటా ఈ మాటా ఆడుకుంటున్నారు.

"మన శ్రీనివాసులు భార్య ఎందుకు బావిలోపడి చచ్చిపోయిందో తెలుసా భానూ?" అనడిగాడు మాట మీద మాటవచ్చి.

"తెలీదు."—అంటూ తల అడ్డంగా ఊపాడు.

"వాడి తండ్రి దాన్ని గింజులాడాట్ట."—అన్నాడు.

"ఈ మాట నేనూ విన్నాను. కాని దానిమీద-నాకేమీ నమ్మకం కుదర్లేదు. ఎంతైనా తండ్రి."—అన్నాడు మార్దవమైన ధ్వనితో.

"నిజమే ఐఉంటుంది. లేకపోతే ఈ వయస్సులో ఆయన ఉంపుడుకత్తెతో కులకడమేమిటి?"-ఒక నిదర్శనం చూపించాడు.

ఇలాంటి సంగతులు అన్నదమ్ములెప్పుడూ మాట్లాడుకోలేదు. ఐతే ఈసారి ఒకరు చెబుతూంటే ఒకరు వినకుండా ఉండలేకపోయారు.

ఈ సంభాషణకి ఏదో మూలం ఉంటుందని భానుమూర్తి ఊహించుకున్నాడు. అతని మెదడులో వదినా తండ్రీ మెదిలారు. తండ్రిని శంకించడం వైతరణిలో దూకినట్లుగా ఐంది. 'ఛీ! తప్పు' అనుకుని మనస్సులో పశ్చాత్తాపం పొందాడు.

"ఈ ఇంట్లో ఉండడం రోజు రోజు దుర్భరంగా ఉంది భానూ!"—విషయం మార్చాడు అన్న. భానుమూర్తి శూన్యంగా అన్నని చూశాడు. అతనే చెబుతూపోయాడు. "అత్తమ్మవాళ్ళు (భార్య పుట్టింటివాళ్లు) మూడు నాల్గువేలరొక్కం ఇవ్వడమేకాక వాళ్ళ వ్యాపారంలో వాటా ఇస్తారట. రోజూ అమ్మానాన్నలు ఇంటికి వచ్చిన వాళ్లితోటల్లా మీ వదిన్నా నన్నూ అనే మాటలు విన్లేకండా ఉన్నాను. వీళ్ళ మనస్సులకు కొంచెం అనుతాపం కలిగేదాకా వాళ్ళ వ్యాపారం చూస్తుండటం మంచిదని తోస్తూంది."

భానుమూర్తికి ఇదంతా వింటూంటే అమ్మానాన్నలు అన్నావదినలపై ఏదో సాధిస్తున్నట్లుగానే తోచింది. 'ఛీ, కనుకున్న సంతానంపై సాధింపులేమిటి? పుట్టిన్నాడే పీక నులిమివుంటే ఎంత బావుండేది' అనుకున్నాడు. 'ఇక్కడే తలిదండ్రుల వాత్సల్యంపట్ల శంకకు అంకురారోపణ జరిగింది. ఐనా, కొంచం సంఘగౌరవ దృష్టిలో అన్నకు నచ్చజెప్పాడు. "ఈ ఊహ బాగానేఉంది. కాని స్వంతఇల్లు విడిచిపెట్టి ఎక్కడో ఉండడం మనకూ గౌరవప్రదంకాదు; అమ్మానాన్నలకూ, ఇంకా కొన్నాళ్ళు జరిగితే నీళ్ళూ పాలూ తేలిపోతాయి, మనం త్వరపడకూడదు. ఆనాడే ఏదైనా ఒకటి చేద్దాం."

తమ్ముని సలహాకు కష్టంగా అంగీకారం సూచించాడు అన్న.

మర్రోజు బస్తీకి వెళ్ళిపోయాడు భానుమూర్తి.

* * * *

పరీక్షలింకా నెలరోజులున్నాయి. బస్తీలో భానుమూర్తి సంసారసంబంధమైన కలవరాన్ని ఒకవైపున అణచిపెట్టుకుంటూ చదవడానికి ప్రయత్నిస్తున్నాడు. అన్నయ్య ఒకనాడు బస్తీకివచ్చాడు. "వంద చెప్పినా నేనింక ఆ ఇంట్లో ఉండలేను తమ్ముడూ" అన్నాడు.

"మళ్ళీ ఏంజరిగింది?"

"ఏంజరగాలి? వాళ్లు పెద్దపట్టుపట్టారు, మీ వదిన ముఖం ఈ జన్మలో చూడరట. ఏమాట మాట్లాడినా ఇంటి పెత్తనం నువ్వు తీసుకో అని తాళంచెవుల

గుత్తిని మీదికి విసురుతారు. ఎందుకు బాబూ! ఈ నీలాపనిందలు. నేను ఒక్కణ్ణే, దాన్నెటూ తరిమారు కదా., పోతే అందరికీ బావుంటుంది."

భానుమూర్తికి ఏమీ తోచలేదు. క్షణం ఆలోచించి "అన్నా! అలా అనుకోకు. సమర్థత ఉన్నప్పుడు పెత్తనం తండ్రీ కొడుకుల్లో ఎవరు నడిపితే నేం? వాళ్ళకీ వృద్ధాప్యం. కావలసిందంత 'తింటానికి తిండీ, కట్టడానికి గుడ్డా. ఈమాత్రం పడేస్తే హాయిగా 'కృష్ణా! రామా! అనుకుంటూ కూచుంటారు. పెత్తనం మనం నడుపడం శ్రేయస్కరం" అన్నాడు గత్యంతరం లేక.

"లోకు లేమనుకుంటారు? తండ్రి ఉండగా కొడుకులు—" అర్ధోక్తిలో ఆగాడు.

"లోకులలో మనకు నిమిత్తంలేదు. మనం సంసారాన్ని అల్లరిపెట్టకపోతేసరి."

"ఈ విధానం నాకు బాగనిపించడంలేదు."

"నాకు మరో ఆలోచన తడ్తోంది. వదిన పుట్టింటివాళ్ళు, వాళ్ళ వ్యాపారంలో వాటాయిచ్చి ఏమేమో చేస్తామని ఒకనాడు అన్నారుకదా, ప్రస్తుతానికి అక్కడుండడం బావుంటుంది. కొన్నాళ్ళకైనా నాన్నగారి మనస్సు మారిపోవచ్చు. అప్పుడు వాళ్ళ ఆస్తి వాళ్ళకిచ్చేసి మన ఇంటికి మనం రావచ్చు. అలా కాకపోతే నా పరీక్షలు ముగియడంతోనే ఇంటి పెత్తనం మనమే తీసుకొని నడిపిద్దాం."

అన్నయ్య ఈ సూచనను ఆధారంగా తీసుకొని భార్య పుట్టింటికి వెళ్ళివచ్చాడు. వాళ్లు, ప్రస్తుతం చేతిలో డబ్బేమీ లేదన్నట్లూ, వ్యాపారంలో వాటాలన్నీ విక్రయించినట్లూ చెప్పారట. ప్రయత్నంచేసి ఇంతలో కొంత డబ్బు సర్దుతామనీ, స్వంత వ్యాపారం, చిన్నదొకటి, చెయ్యమనీ సలహా యిచ్చారట. వాళ్లు చెప్పినమాటల్ని బట్టి ఆత్మీయులుగా కన్పడే వాళ్లను ఎంతవరకు నమ్మవచ్చునో అర్థమైంది భానుమూర్తికి.

*   *   *   *

పరీక్షా కేంద్రం జిల్లాకేంద్రంలో నియమింపబడటం మూలాన్ని భానుమూర్తి అక్కడికి వెళ్ళాడు. పరీక్షలయి తిరిగిరాగానే అన్నగారు బావిలోపడి ఆత్మహత్య చేసుకున్నాడని విన్నాడు. శవాన్ని దహనం చేయకుండా తనకోసమే ఆపారని తెలిసింది. ఈ దుర్ఘటన అతని జీవితాన్ని తలక్రిందులు చేసింది.

ఈ వార్త వినడంతోనే భానుమూర్తి పిచ్చివాడై పోయాడు. అంతటి దుఃఖం తన జన్మలో ఎప్పుడూ పొందిఉండడు. శవం దగ్గరికి పరుగెత్తి తలబాదుకొని ఏడ్చాడు. తల్లి శోకమూర్తి అయిపోయింది. వదిన మూర్తిని పట్టుకొని రాగాలు తీసింది. తండ్రి వాడిపోయిన ముఖంతో ఒకచోట కూర్చున్నాడు. ఏడుస్తున్న కొడుకును దగ్గరికి తీసుకొని ఓదార్చడానికి ప్రయత్నించాడు. "ఛూ, పిరికిచావు చచ్చాడు." అన్నాడు గంభీరంగా. ఆయన ముఖంలో ఏభావం ద్యోతకమైందో కొడుకు గ్రహించలేదు.

భానుమూర్తి హృదయంలో ఈమాట వింటూనే రుషావిషార్చులు ప్రజ్వరిల్లినవి. చనిపోయిం తర్వాత కూడా నిందించటం మానలేదే అనుకున్నాడు. పలువురు పలువిధాల అనుకున్నారు, చావును గురించి. చాలామంది నోళ్లలో తలిదండ్రులే కారకులనే మాట వచ్చింది. ఎన్ని నేరాలవసరమో అన్ని నేరాలు మోపారు. భార్య పుట్టింటివాళ్లి దగ్గర్నుంచి కొంత విత్తం వ్యాపారంనిమిత్తం తీసుకున్నాడని, చేసిన వ్యాపారంలో నష్టం రావడంవల్ల సమయానికి దాన్ని చెల్లించలేకపోయాడని తత్కారణంగా వాళ్లు ఆడిన దుర్భాషలే అతణ్ని ఆత్మహత్యకు ప్రేరేపించినాయని అన్నారు ఒకరిద్దరు. భార్య ప్రవర్తనను శంకించి అలా చేసాడని ఎక్కడో విన్పడింది ఒక గుసగుస. భానుమూర్తి అల్ప సంఖ్యాకుల ద్వారా వెలువడిన అభిప్రాయాన్ని అట్టే మనస్సుకు తీసుకోలేదు. తలిదండ్రులపై, వారి వాత్సల్యముపై ఒకనాడు అతనిమనస్సున అంకురించిన హేయభావపు మొలక ఈనాడు మహావృక్షమై అతనిలో అణువణువున ప్రాకిపోయింది. తనకు ప్రియతముడైన అనుజన్ముని మృత్యువుకు కారకులైన వాళ్లిమీద, ముఖ్యంగా తండ్రిమీద, ఏదో సాధించాలని ఒక క్రోధం బలపడింది మనస్సులో.

మృతజీవికి కర్మకాండ జరిపేరోజున పెద్దలంతా గూడి విగత భర్తృకకు ఆస్తిలోని కొంతభాగం కేటాయించారు. చేరిన పెద్దమనుషులు ఆమెను సంబోధించి, "ఏమమ్మా! నీ మరదితో కలిసి వుంటావా, లేక కొంత భాగం రాయాలా?" అని అడిగితే ఆమె అంతటి శోకంలో కూడా "ఎవరిపై మాత్రం ఏం నమ్మకం", అంది. తనకు పూర్వంనుంచీ వదినపై ఏర్పడిన అభిమానాన్ని బట్టి చూస్తే ఆమాట మరొకరిలో అయితే

ప్రళయం తెచ్చివుండును. కాని భానుమూర్తి చాలా తేలిగ్గా పోనిచ్చాడు. “అవును నన్ను నమ్మవలసిన అవసరమేమిటి?” అనుకున్నాడు. చట్ట ప్రకారం ఆమె పేర అర్ధభాగాన్నే వ్రాశారు కాని ఆస్తియావత్తూ ఆమెకిచ్చివుండినా అభ్యంతరం తెలిపివుండేవాడు కాడు.

వదిన పుట్టింటికి వెళ్ళిపోయింది. భానుమూర్తి భ్రాతృవియోగ విషాద సాగరంలో మునిగి మూగనోము ప్రారంభించాడు. ఇంట్లో అమ్మా నాన్నలతో కూడా మాట్లాడడం మానివేశాడు. ఇది చూసి లోకులంతా అతనికీ అన్నకూ వున్న అకలంకమైన, అవ్యాజమైన ప్రేమని కీర్తించారు. దాంతోపాటు అతని మరణానికి తలిదండ్రులు కారకులనే తను వాళ్లతో మాట్లాడడం లేదని చెప్పుకున్నారు. తన ప్రవర్తన విషయమై లోకుల గుసగుసలు విన్న తలిదండ్రులు దిక్కు తెలియక దుఃఖిస్తుంటే, ‘హుం అంతా నటన’ అనుకున్నాడు. వాళ్లు ఎంత బాధపడితే, ఎంత నిందితులైతే అంత తృప్తిని పొందాడు.

ఉన్న కొడుకును ఒక్కణ్ణి కళ్ల ఎదుటి నుంచి దూరంగా వుంచలేమని ఘోషిస్తున్నా, భీష్మించి, పరీక్షా ఫలితాలు వెలువడడంతోనే పై చదువుకని నగరము ప్రయాణమై వెళ్ళాడు. తను లేకపోవడంవల్ల వాళ్లేలాంటి బాధ పొందుతారో చూడాలని భానుమూర్తి ఉద్దేశ్యం. కన్నకొడుకు మరణానికి కారకులైన వాళ్ళకు హీనమైన బ్రతుకు సంప్రాప్తిస్తుందని అతనిలో ఒక నమ్మకం పాదుకుపోయింది. ఆ హైన్యం, ఎటువంటిదో స్వంతకళ్ళతో చూస్తే కాని అతనిలో వున్న ప్రతీకార వాంఛ తీరదు. అప్పుడే అతని హృదయానికి శాంతి.

నగరంనుంచి ఎప్పుడైనా వుత్తరం వ్రాస్తే దానిలో డబ్బు పంపమని తప్పితే మరొకటి వుండేది కాదు. తండ్రికి వుత్తరాలు రాయడం తెలియదు. కాని వున్న ఒకడూ దూరాన వుండడంవల్ల ఎట్లో అలవరచుకున్నాడు. భానుమూర్తి వుత్తరాలకు రోజూ ఎదురు చూసేవాడు. కాని చాలా అరుదుగా వుత్తరం వచ్చేది.

అప్పుడప్పుడు నగరం వచ్చిన ఊరివాళ్లు భానుమూర్తితో, తండ్రి చాలా కష్టపడుతున్నాడనీ, ఆ ముసలివాళ్లి బ్రతుకు జాలికరంగా ఉందనీ చెప్పారు. మూర్తి కించిత్తయినా సానుభూతి చూపలేదు. ఎందరు ఎన్ని విధాల, తండ్రిపడే అవస్థను, తెలిపినా తండ్రి నుంచి వచ్చే వుత్తరాల్లో మాత్రం ఎప్పుడూ అలాంటి బాధను చూడ్లేక పోయాడు. అందులో మొదటినుంచీ చివరిదాకా ‘మేం క్షేమంగా వున్నాం’ అనే మాటే ధ్వనిస్తూ వుండేది.

ఒకమారు భానుమూర్తి సెలవుల్లో ఇంటకివచ్చినప్పుడు తండ్రికి ఎదలో నొప్పి ప్రారంభమైంది. ఆయన స్థితి చూస్తున్నా భానుమూర్తి చలించలేదు. కొడుకు ఎదుటికి రావడంతోనే తండ్రి, తనకున్న బాధను ఆవంతైనా వ్యక్తం చేసేవాడు కాదు. మామూలుగానే మాట్లాడేవాడు. ఆయన ప్రవర్తనను అర్థం చేసికోలేక భానుమూర్తి వుక్కిరి బిక్కిరి అయ్యేవాడు. ఒకనాడు ఆయన గుండెనొప్పి గరిష్ఠ స్థితికి వచ్చింది. అందరూ బస్తీ హాస్పిటలుకు తీసికెళ్లమని సలహా ఇచ్చే సరికి తప్పలేదు. తండ్రి ఒప్పుకోలేదు. అయినా బలవంతాన తీసికెళ్ళాడు. అక్కడ తండ్రికి అప్రయత్నంగా శుశ్రూష చేశాడు. అశ్రద్ధా మిళితమైన పరిచర్యలు చేయడంలో అతని వుద్దేశ్యం వేరు. ఆయన పడిన బాధలకు తన హృదయం ఇంకా పూర్తిగా తృప్తిపడలేదు. ఇంకా కొన్నాళ్లు కష్టపడేటట్టు చూడాలి. ఇప్పుడే చనిపోతే బావుండదు—ఇదీ అతని ఉద్దేశ్యం...తండ్రికి నెమ్మదించింది.

భానుమూర్తి ఇంటరు పరీక్షలనుంచి ఇంటికి వెళ్లేసరికి తండ్రి చనిపోయాడని తెలిసింది. ఇదివరకటి గుండె నొప్పే మళ్ళీ ప్రారంభమై పదిరోజులదాకా బాధించిందని చెప్పేరు. అయితే తన కెవరూ తెలియపరచక పోవడంలో అర్థమేమిటో అవగాహన కాలేదతనికి. రక్తసంబంధమైన దుఃఖం అతనిలో ఏమూలన్నా ఏకొంచెం కలిగిందో లేదో కాని, తండ్రి ఎలా అవస్థపడ్డాడో చూడ్లేకపోయానని మాత్రం శోకించాడు ఏకధారగా. మిత్రులూ, అమ్మా, వూరివాళ్ళూ అందరూ సంజాయిషీ చెప్పుకున్నారు. “తనిక బ్రతికడనీ, తనసంగతి నీకు తెలియపరచడం మూలాన్ని నీవు పరిక్షలు వదిలిరావడం తప్పితే జరగబోయే మేలేమీ లేదనీ, మీనాన్నగారు తెలుపనిచ్చారు కాదు” అన్నారు.

గొప్ప ఆశాభంగం కలిగింది మూర్తికి. తను పగతుర చేతుల్లోపడి ముక్కలు ముక్కలుగా ఖండింపబడినా ఇంతటి బాధ, అవమానం పొందివుండేవాడు

కాదు. తండ్రి మరణం తను ఎదుట లేనప్పుడు సంభవించిందికదా అనే దుఃఖం, ప్రతీకారవాంఛ తీర్చుకోలేక పోయిన విచారం అతనిలో పరవళ్లు త్రొక్కింది.

ఒక రెండుసంవత్సరాలు గడిచాయి. ఆలోగా వదిన రావడమూ, కొన్నాళ్లువుండి మళ్ళీ పుట్టింటికి వెళ్ళడమూ జరిగినై. ఉన్న రెండుమూడు మాసాలైనా ఆమె ఇంట్లో అపరిచితలాగే వుంది. భానుమూర్తితో తప్పితే తన కితరులతో సంబంధం లేనట్లుగానే చరించింది. అతనితోవున్న, ఏర్పడిన చనువును పురస్కరించుకొని తల్లికీ అతనికీమధ్య భిన్నాభిప్రాయాలు కల్పించడానికి ప్రయత్నించింది. ఇది మొదట మొదట భానుమూర్తికి అర్థము కాకపోయినా కాలక్రమేణా అవగాహనైంది. ఆమె ఉన్నట్టుండి ఒకనాడు పుట్టింటికి వెళ్ళిపోయింది. తిరిగి రాలేదు. ఈమధ్యకాలంలో భానుమూర్తి హృదయం కావలసినంతగా పరివర్తనం చెందింది. తను ఎంతటి అపచారం చేశాడో తలచుకుంటే గుండె చిద్రుపలైపోయేది...

* * *

వేసవి, పైరు ఏమీ లేకపోయినా భానుమూర్తి ఎటూతోచక పొలంలోకి వెళ్ళాడు. పొలం మధ్యన ఒక ఎత్తయిన శిలవుంది. దానిమీద నిలుచుంటే పొలం నాలుగువైపులా కలియ చూడవచ్చు. తండ్రి బ్రతికి ఉండగా ఆయన ఎల్లప్పుడూ ఆ శిలమీద కూచుని అప్పుడప్పుడు లేచి చేనువైపు చూస్తుండేవాడు. భానుమూర్తి నేరుగావెళ్ళి దానిమీద కూర్చున్నాడు. అక్కడ కూర్చుంటే అతనిలో తండ్రికి సంబంధించిన గతస్మృతులన్నీ ఒక్కొక్కటే కదలి కరిగిపోసాగినై. కనుకొలకుల్లో నీళ్లు సుళ్లుతిరిగి చెంపలమీదుగా చారలు కట్టినై. అతనలా ఎంతసేపు కూర్చున్నాడో తెలియదు. కొంత తడవయాక తన వెనుకవైపునుంచి వీస్తున్న గాలి రొదలో ఏదోగానం అవ్యక్తంగా వినరాసాగింది. అది రానురాను కొంచెం పెద్దదైంది.

"పత్తే పత్తేమే పర్వర్ద్ గార్ హైం, హైం, హైం
పత్తే పత్తేమే పర్వర్ద్ గార్ హైం, హైం, హైం"--

పాట తనకు చిరపరిచితమైందే. కంఠస్వరం కూడా...ఆ పాటను, ఆ గొంతుకను పోల్చుకుందామని ప్రయత్నిస్తుండగానే గాలి కొంచెం తగ్గింది. పాట కూడా ఆగిపోయింది. ఆ స్థితిలో పోల్చుకోవడం అతనికి సాధ్యపడలేదు. వెనక్కి తిరిగి చూశాడు. ఎవరూ కన్పడలేదు. వేడి నిట్టూర్పు వదుల్తూ అక్కడే కూర్చున్నాడు.

గాలి ప్రవాహం ఎప్పటికిమల్లే మారింది. ఈమారు అదే గాలిరొదలో మరోపాట అలల్లాగా

"రామా! విడువను నిన్ను—ఓ
రామయా! విడువను నిన్ను"—

అనేగి కొట్టుకు రాసాగింది.

ఈ పాట విన్పడడంతోనే చప్పున జ్ఞాపకం వచ్చింది, అంతకుముందు పాటకూడా ఎవరు పాడేవారో. రెండూ తన తండ్రి కంఠంలో ఎప్పుడూ మ్రోగుతూ వుండేవి. రెంటిలో ఏదీ ఆయనకు సరిగా వచ్చేదికాదు. అయినా ఆ వచ్చినమటుకే అతి సంతోషంగా కూనిరాగంతో పాడుకునేవాడు. ఒక పాట ముగియగానే మరోపాట మొదలెట్టేవాడు. తండ్రికి భగవంతునిపట్ల భక్తి విశ్వాసాలు అధికం. అనంతమైన ఆ భక్తి విశ్వాసాల అండచూసుకునే ఒక్కొసారి దయారాశియైన, ఇక్ష్వాకువంశ పాథోరాశిరాకా చంద్రుడైన శ్రీరాముణ్ణి—

ప్రమాద రక్షణకు
ప్రశస్తమైనది
భీమా

ఎప్పుడే ప్రమాదం వచ్చేదీ, ఏ క్షణం ఎలా
ఉండేదీ తెలియని ఈ దినాలలో
* అగ్ని * మోటార్‌కారు * కార్మిక నష్టపరిహారం
*నౌక *ఫయడిలిటీ గ్యారంటీ *మొదలైన భీమాలకు
మాతో సంప్రతించండి;

యునైటెడ్ ఇండియా ఫైర్ అండ్
జనరల్ ఇన్సురెన్సు కంపెనీ
లిమిటెడ్,

"యునైటెడ్ ఇండియా లైఫ్ బిల్డింగ్సు"
ఎస్ప్లనేడ్ - మద్రాసు.
Telephone: 4241. Telegram : "UNIGEN"
బ్రాంచీలు:
బొంబాయి-కలకత్తా-కొలంబో-సింగపూరు-విజయవాడ-
ఢిల్లీ-పాట్నా-లక్నో-బెంగుళూరు కోయంబత్తూరు

"కుడిపాద మొకచేత- నీ ఎడమపాద మొకచేత
విడువక నిను నే వినుతిజేసెదను
తడయక నను నీ దయతో నేలిన నేలుము."—

అని వినయంగా ప్రార్థించేవాడు.

మరొక్కప్పుడు—

"ఒట్టు బెట్టెదను చూడు- నిను వదలగ నివ్వను నేడు
పామరుడను బహు పాపకర్ముడను
తామసమున నిను నేతన్నినదన్నెద—"

అని జడిపించేవాడు. కోప్పడేవాడు. ఈ విధమైన దివ్యగుణాలు ఆయనలో లీనమై వున్నవి.

భానుమూర్తి పాటవినవచ్చిన వైపుకు దృష్టిని సారించాడు లేచి. అశ్రుపూరితాలైన చక్షువులకి దూరంగా ఏదో పొగమబ్బులాంటి ఆకారం కనపడింది. అది కదలి క్రమంగా తనదగ్గరికి వచ్చేసింది. భానుమూర్తి ఆశ్చర్యపడ్డాడు: తలపాగా, చేతిలో లాఠీ, నోటిలో చుట్టా అంతా నాన్నగారి ఆకారమే.

"నాన్నా!" అని ఒక గావుకేక వేసి పడిపోయాడు ఏడుస్తూ, సగంస్పృహ, సగంనిస్పృహాలో వున్న మూర్తి చెవులకు మృగువైన. గంభీరమైన, బాధామిళితమైన కంఠంలో చెబుతున్న మాటలు వినిపించినై.

"భానూ, ఎందుకు వూరికే దుఃఖిస్తావు? వున్న ఒక్కడివైనా సుఖంగా వుండకపోతే మా హృదయాలు ఎంతక్షోభిస్తాయో గ్రహించలేవా? నువు చదువుకున్నవాడివి. మమ్మల్ని అర్థంచేసికోవాలనే నిన్ను చదివించాం. కాని నీవు చీకటివైపు మొగ్గిపోయావు. మేం కన్పడలేదు... ఏ తలిదండ్రులు తమకొడుకు మరణం వాంఛిస్తారో నాకు తెలియదు. లోకులు మమ్మల్ని ఏ ఆధారంమీద నిందించారో నాకీనాటికీ అర్థం కావటంలేదు. ఒకరి సంసారం చల్లగా సాగుతుంటే చూడలేనిదీలోకం. ఆ రోజుల్లో మీ వదిన కాపురానికి కొత్తగావచ్చింది. అందరూ దానిమీద అర్థరహితమైన సానుభూతి కన్పరిచి నామీద అకారణద్వేషాన్ని సాధించారు. స్వంతకొడుకువు నువ్వే మాపట్ల విరోధభావం వహిస్తే ఇంక నేనెవరితో చెప్పుకోవాలి?... నీలో నాలుకలు సాచిన ప్రతీకారజ్వాల నాకగుపడింది. దాన్ని ఆర్పడానికి నేను మొదట్లో కొంచెం ప్రయత్నించాను, కాని నా ప్రయత్నం వృథా అని తెలుసుకోగానే నా వుద్దేశ్యం మార్చుకున్నాను. నేను అలమటిస్తుంటే నీవు చూడాలనుకున్నావు. కాని నేనందుకు తావివ్వలేదు. ఎంతబాధపడినా లోలో నే పడ్డాను. నా బాధనుచూచి నీవు తృప్తిపడడం నాకూ, నా ఆత్మాభిమానానికీ ఓటమిలా అగుపడింది. కన్నకొడుకుకొరకు ఆత్మాభిమానాన్ని త్యాగంచేయలేకపోయాను. నా ఉద్దేశ్యంలో నేను విజయుణ్ణి అయినానని నా కిప్పుడు సంతోషమేమీ లేదు. నీవు పరాభవింపబడినట్లు బాధచెందుతూంటే నా హృదయం చూసి సహించలేకుండా వుంది. మీ అన్న ఆత్మహత్యకి కారణం ఏమైవుంటుందో ఈనాడు నీకవగతమై వుంటుంది. నేను ఆ విషయం ఎక్కువేమీ చెప్పలేను... అయితే ఒకటి చివరిమాట మున్ముందు నీ జీవితంలో ఆత్మాభిమానం చచ్చిపోతుందనే అహంతో నీ సంతానంపట్ల ఎన్నడూ నాలా ప్రవర్తించకు. వాళ్ళకు కష్టం కలిగించకు. నిన్ను సంతృప్తి పరచలేని బాధ నన్ను కలకాలం దహిస్తోంది."—

భానుమూర్తి భూమీమ్మీదినుంచి లేచి చూసేసరికి మొదటి ఆకారంలేదు. పశ్చాత్తప్తమైన హృదయంతో తాను పడివున్నస్థలాన్ని చూశాడు. కన్నీళ్లతో ఆ చోటుమాత్రం కొంచెం తడిసివుంది.